రమ్యభారతి

సాహిత్య త్రై మాస పత్రిక

ఫిబ్రవరి - ఏప్రిల్ 2024

వెల. రూ.10/-






సాహితీ స్వర్ణోత్సవ

పూర్ణచంద్రుడు

“ప్రజల కోసమే నేను రాస్తున్నాను”

పూర్ణచంద్రుని అంతరంగ తరంగ రాగరాగాలు

ఆయనొక కవి, కథా, నవలా, చారిత్రక రచయిత, వ్యాసకర్త, ఆయుర్వేద వైద్య రచయిత, శతాధిక గ్రంథకర్త, పరిశోధకుడు, కాలమిస్టు, వక్త, ‘ముక్కాలు’ కవితా ప్రక్రియ సృష్టికర్త... కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి... ఇవన్నీ చెబుతుంటే మీకు టక్కున ఒకాయన చిత్రరూపం కళ్ళముందు కదలాడే ఉంటుంది... అవును.. ఆయనే డా॥ జి.వి.పూర్ణచందు. ఆయన సాహితీ జీనవప్రయాణంలో ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పూర్ణచంద్ గారితో ‘రమ్యభారతి’ ప్రత్యేకంగా చేసిన ముఖాముఖి... మీ కోసం...





ప్రశ్న: సాహిత్యం మీద మీకు అభిరుచి కలగడానికి ప్రేరేపకులు ఎవరు?

సాహిత్యాభిరుచికి తొలి ప్రేరకుడు మహాకవి దుర్గానంద్. ఆయన ‘చిరంతన’ ఖండకృతి రాస్తున్నప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. వాళ్ళబ్బాయి అంబికానాథ్ నేను క్లాసుమేట్లం. ఆయన రాసిన వాటికి ఫెయిర్ కాపీలు రాసే వాళ్ళం. తరువాత ఇంటర్మీడియట్ చదువు విజయవాడ శాతవాహన కళాశాలలో. లెక్చరర్లు డా జంధ్యాల పరదేశీబాబుగారు, యద్దనపూడి వెంకటేశ్వరరావు గారు, నాలో రచయితను గుర్తిస్తే, శ్రీ పురాణపండ రంగనాథ్, శ్రీ తుమ్మల వెంకట్రామయ్య, శ్రీ ఏటుకూరి బలరామమూర్తి, శ్రీ మైత్రేయ ప్రభృతులు నాకు దిశానిర్దేశం చేశారు. 1973-74లలో



నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి నుండి 'కళారత్న' (హంస) పురస్కారం అందుకుంటూ....


విహారి, శాలివాహన, గుత్తికొండ సుబ్బారావు నాలో పరిణతి కలిగేందుకు మార్గదర్శనం చేశారు. నా ఎదుగుదలకు స్నేహితుల తోడ్పాటు ముఖ్య కారణం. శ్రీ మండలి బుద్ధప్రసాద్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గార్ల పరిచయం నన్ను అంతర్జాతీయ స్థాయికి చేర్చింది. అభిరుచి 8వ తరగతి నుండి మొదలైనా అభినివేశానికి ఇందరు ప్రేరకులున్నారు.

పశ్న: మొట్టమొదటి మీ రచన ఎప్పుడు ఎక్కడ ప్రచురితమైనది?

జవాబు: నూజివీడులో అంబికానాధు, ఇంకా మిత్రబృందం కలిసి 1972లో నేను సంపాదకుడిగా మేఘమాల లిఖిత పత్రిక నడిపాము. 1974లో జయశ్రీ వీక్లీ, మంత్లీలకు రచనలు చేసాను. కార్టూన్లు కథలకు బొమ్మలు వేసేవాణ్ని. చొక్కాపు వెంకటరమణ అప్పుడు జయశ్రీని చూసేవారు. 1974లో శివాజీ పట్టాభిషేక త్రిశతాబ్ది ఉత్సవాల సందర్భంగా కాలేజీ మెగజైన్ తెస్తే దానికి విద్యార్థి ప్రతినిధిగా ఉన్నాను. ఆ ఏడాది నోబెల్ బహుమతి గ్రహీతల గురించి ఒక వ్యాసం అందులో నేను వ్రాశాను. 1975లో ఆంధ్రప్రభ వారపత్రికలో ఆత్మలతో మాట్లాడగలమా వ్యాసాన్ని ప్రచురించి విద్వాన్ విశ్వం గారు 15రూపాయలు పంపారు. అది నా తొలి సంపాదన. 1978 నుండి సౌజన్య వారపత్రికలో ప్రతి వారం ఒక వ్యాసం వ్రాశాను. 'ఇదీ సంగతి' ఫీచర్ నడిపాను. ఇదీ నేను నిర్వహించిన మొదటి



నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కె.కిరణ్‌కుమార్‌రెడ్డి గారి నుండి సత్కారం పొందుతూ.. చిత్రంలో బొత్స సత్యనారాయణ, మండలి బుద్ధప్రసాద్ తదితరులున్నారు



పోలవరం ప్రాజెక్ట్‌పై కవులు రాసిన 'పోలవరం-పట్టిసీమ' కవితా సంకలనాన్ని నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా ఆవిష్కరింపజేస్తూ.. చిత్రంలో ఆనాటి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, మంత్రివర్యులు దేవినేని ఉమా తదితరులు.

కాలం. మొదటి నుండి రాయటానికి అవకాశాలు అయాచితంగానే వచ్చేయి. రాస్తున్నకొద్దీ రాయటం నేర్చుకున్నాను.

1979లో మీరు మినీకవితని 'విప్లవం' అని ప్రచారం చేశారు. దాన్ని ఇప్పుడెలా సమర్థించుకుంటారు?

సాహితీ విప్లవం అంటే నా అభిప్రాయాన్ని మొదట చెప్పాలి. వాస్తవిక ప్రపంచంలో ఏదీ స్థిరం కాదు. ప్రతీదీ మార్పు చెందుతుంది, వృద్ధి చెందుతుంది, నశిస్తుంది. అందుకు తీవ్రమైన ఘర్షణకూడా అనివార్యం అవుతుంది, మార్పుకు సూచనే విప్లవం. నశించిపోతున్న లక్షణంపైన వృద్ధి పొందుతున్న లక్ష్యం సాధించే విజయమే విప్లవం. సాహిత్యవిప్లవాలు ఈ మార్పుకు అనుగుణంగా ఏర్పడతాయి. సామాన్యుడు వస్తువయ్యాక సాహితీ విప్లవాలన్నీ వస్తుపరంగా కాకుండా రూపపరంగానో, భావజాల పరంగానో ఏర్పడసాగాయి. రూప విప్లవానికి మినీకవిత ఒక ఉదాహరణ. 1979లో మినీకవితా ఉద్యమాన్ని ఈ దృష్టితోనే 'మినీకవితా విప్లవం' అన్నాము. 45యేళ్ళ తర్వాత కూడా ఈనాటికీ కవిత్వంలో కొత్తగా వస్తున్న ప్రక్రియలన్నీ లఘురూపాల్లోనే ఉండటాన్ని గమనిస్తే, మినీకవితని ఆనాడు మేం ఒక విప్లవం (మార్పుకు సంకేతం) అనటం సబబేకదా!



ప్రఖ్యాత సినీ గాయనీ పి.సుశీల గారిచే సత్కారం పొందుతూ..



సిరివెన్నెల సీతారామశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి గార్లతో కలిసి 'హంస' పురస్కారం తీసుకున్న సందర్భంలో ఆనందం పంచుకుంటూ...

మీరు చెప్పినట్టు కొత్తగా ఏది రాసినా అది విప్లవమే అవుతుందా? మీ దృష్టిలో 'కొత్త విప్లవం' అంటే ఏది? మీ రచనల్లో అలాంటి కొత్తవిప్లవం ఏదైనా ఉందా?

కొత్త ప్రతీకలు, కొత్త భావాలు, కొత్త పరిష్కారాలు మనసుకు తట్టేలా చేసిన రచన కొత్తదనం కలిగింది అవుతుంది. ఈ కొత్తదనం రచనా సూత్రాల్లో మార్పుని తెస్తుంది. దాన్ని విమర్శించటానికి లేదా పరామర్శించటానికి తూకపురాళ్ళు కొత్తవి అవసరం అవుతాయి, ఆ రచన ఇతర రచయితల పైన ప్రభావం చూపించి ఆ మార్గాన కవులు ఉద్యమించి రాసినప్పుడు అది ఉద్యమం అవుతుంది. ఆ ఉద్యమం మార్పుని స్థిరీకరిస్తే అది విప్లవం అవుతుంది. ప్రాంతీయవాదం, కులవాదం, మతవాదం, ఇంకా అనేక విదేశీ వాదాలు ఉద్యమ స్థాయి పొందకుండానే చల్లారిపోవటాన్ని గమనిస్తూనే ఉన్నాం. నన్నయ, సోమన, పెద్దనలు గానీ, భావకవులు గానీ, అభ్యుదయ కవులుగానీ, దిగంబర కవులు గానీ తెచ్చిన మార్పు అసామాన్యమైంది. చలం, శ్రీశ్రీ, విశ్వనాథలూ చేసింది ఈ మార్పు యత్నమే! శ్రీ శ్రీ రచనలపై విమర్శకు పాత ఆలంకారిక సూత్రాలు ఎలా గిట్టవో, విశ్వనాథ రచనకూ అలానే గిట్టవు. కొత్త తూకపు రాళ్లను సృజించలేక పోవటం విమర్శకుల లోపం. శేషేన్ ఇందుకోసం చాలా ప్రయత్నం చేశాడు. అన్నమయ్య 400 యేళ్ళ తరువాత, త్యాగరాజ స్వామి 80 యేళ్ళ తర్వాత వెలుగులోకి వచ్చారు. చరిత్రలో నిలిచేదెవరో చరిత్ర నిర్ణయించాలిగానీ ఇప్పటి కొందరు కాదు కదా!

తెలుగులో విమర్శ లేకుండా పోయిందంటున్నారు కదా... కారణం ఏదంటారు?

కమ్యూనిష్టులు బలహీనపడటం. తెలుగు సాహిత్యం మీద వారికి అదుపు తప్పటం పెద్ద కారణం అయితే, పురస్కారాల యావ పెరగటం, ప్రతిభని బట్టి కాకుండా అస్మదీయ తస్మదీయ భావజాలాలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వటం లాంటి చిన్న కారణాల వలన విమర్శ పక్కదారులు పట్టింది. పత్రికలు అంతరించిపోయాయి. ఉన్న పత్రికల్లో 100 మాటలతో పుస్తక పరిచయం మాత్రమే కనిపిస్తోంది. ఒకట్రెండు దినపత్రికల్లో సోమవారం పేజీ ఒక్కటే విమర్శకు గతి అయ్యింది. తమకు నచ్చినవాళ్లని ఆకాశానికెత్తే ధోరణి వదిలి మంచి రచనల్ని గుర్తించటం అవసరం. అభ్యుదయ రచయితల మీద ఈ బాధ్యత ఎక్కువగా ఉందని భావిస్తాను.

'తెలుగు కోసం', 'సొంపైన తెలుగు' లాంటి సాహిత్య విమర్శనా గ్రంథాలు మీరు రాశారు. వాటి



కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో 'జానమద్ది' పురస్కారం అందుకుంటూ...

రచనకు ఏ విమర్శనామార్గాన్ని అవలంభించారు?

తెన్నేటి సూరి సాహితీ మహోదయంతో మొదలుపెట్టి, సాహిత్య విమర్శనా గ్రంథాలు అనేకం వెలువరించాను. ఆనాటి పద్యాన్ని తీసుకుని ఈనాటి సమాజానికి అన్వయిస్తూ 'పద్యానుభవం' పేరుతో 400 వారాలపాటు విశాలాంధ్ర ఆదివారం సంచికలో నేను వ్రాసిన వ్యాసాలు సాహిత్య విమర్శకు నా స్వంత తూనిక రాళ్లను ఉపయోగించి వ్రాసినవి. విమర్శకు అలంకారాలు, వ్యాకరణాంశాల్ని పక్కనబెట్టి భాషాపరమైన అంశాలు, చారిత్రక అంశాలు, సామాజిక అంశాలు, వైజ్ఞానిక, మానసిక అంశాలకు నేను ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాను. విశ్వనాథ ఏకవీరలో సైకో ఎనాలిసిస్ ధోరణుల్ని వెలికి తీశాను. సాంఖ్యుల సిద్ధాంతాల్లోంచి ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ ఎలా రూపుకట్టుకుందో వివరించాను. భిన్నంగా ఆలోచించ గలిగితే మనం కొత్తగా చెప్పగలిగిన అంశాలు అనేకం దొరుకుతాయి.

దాదాపు 40 కి పైగా వివిధ పత్రికల్లో కాలమ్స్ వ్రాశారు. ఒకేసారి 8 పత్రికల్లో రాశారు కూడా! ఇది అరుదైన రికార్డే.. కాలమ్ రాయటం కోసం మీరు సృజనాత్మక సాహిత్యానికి దూరం అయ్యారని నేనంటాను. మీరేమంటారు?

నిజమే కావచ్చు. కానీ పాఠకుల అవసరాలు కూడా ముఖ్యమే! ఒకే పత్రికలో దీర్ఘకాలంగా వ్రాసే కాలమిస్టులకు స్వంత పాఠకులుంటారు. వాళ్లకోసం నేను మాత్రమే రాయగల ఎన్నో అంశాలు నేను రాసిన వాటిలో ఉన్నాయి. ఆ విధంగా నా పాఠకుల్ని నేను తయారు చేసుకున్నాను. అయినా వ్యాస రచన సృజనాత్మకం కాదని ఎలా అంటారు? సృజనాత్మకత అంటే రోజువారీ మనం మాట్లాడే, పాఠ్యపుస్తకాల్లోనో న్యూస్ పేపర్లలోనో చదివే సాంకేతిక సాహిత్యానికన్నా భిన్నమైన రచన. అంతేగానీ కేవలం కవిత లేదా కథ మాత్రమే సృజనాత్మక రచన అనటం సబబు కాదు. కథన నైపుణ్యం, చమత్కారం, అబ్బురపరిచే అంశాలు... మంచి వ్యాసంలో కూడా ఉంటాయి. కాలమ్ రాసేప్పుడు సామాన్యుణ్ణి ఆకట్టుకోవటానికి నేను చాలినంత సృజనను ఉపయోగిస్తాను. ఒక్కో పత్రికలో ఏడెనిమిదేళ్ళపాటు విడవకుండా రాయటానికి ఆయా సంపాదకులు అనుమతించారంటే నా కాలమ్‌లలో



అధికార భాషా సంఘం నుండి 'గిడుగు పురస్కారం ' స్వీకరిస్తూ..



అద్దంకి సృజన సాహితీ పురస్కారం అందుకుంటూ..

సృజన ఉండటమే కారణం.

మీకు చాలా ప్రక్రియల్లో ప్రవేశం ఉంది. అన్ని ప్రక్రియల్లోనూ మీకు నచ్చిన ప్రక్రియ ఏది?

నేను వ్యాసాన్నే ఎక్కువ ఇష్టపడతాను. కానీ, వ్యాసం వ్రాసేప్పుడు నాలోని కవిని, కవిత్వం రాసేప్పుడు నాలోని భాషాభిమానిని, నవలలు రాసేప్పుడు నాలోని పరిశోధకుణ్ణీ నేను దాచుకోలేను. సప్తసింధు, తెలుగుధీర, చిగురులు వేసిన కలలు, హరహరమహాదేవ లాంటి నా నవలల్లో పరిశోధకుడు ప్రస్ఫుటంగా కనిపిస్తాడు. అయినా, నవలకు కావాల్సిన శైలీ చమత్కృతిని నేను ఇనుమడింప చేయటానికే ప్రయత్నించాను.

ప్రపంచవ్యాప్తంగా వున్న రచయితల సంఘాలలో కృష్ణాజిల్లా రచయితల సంఘంకు ఉన్న గొప్పతనం ప్రత్యేకమైనది. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణలో మీ బాధ్యత కీర్తించదగింది. ఈ సంస్థలోకి మీ ప్రవేశం ఎలా జరిగింది? మీ భవిష్యత్తు కార్యాచరణ ఏమిటీ?

కృష్ణాజిల్లా రచయితల సంఘం ఏర్పడటం అనేది ఒక పరిణామక్రమం. 1976లో మచిలీపట్టణంలో కృష్ణాజిల్లా రచయితల 4వ మహాసభలను స్పందన సాహితీ సమాఖ్య నిర్వహించింది. దాని కార్యవర్గంలో నేనూ ఉన్నాను. అంతకు మునుపు కాలనాథభట్ట వీరభద్రశాస్త్రిగారు కార్యదర్శిగా మూడుపర్యాయాలు సభలు నిర్వహించారు. 1982లో మండలి వెంకట కృష్ణారావుగారి ఆధ్వర్యంలో అవనిగడ్డలో జరిపిన 5వ మహాసభల్లో కృష్ణాజిల్లా రచయితల సంఘం ఏర్పడింది. ముక్కామల నాగభూషణం గారు అధ్యక్షులుగా గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, బుద్ధప్రసాద్ గారూ, నేనూ కార్యదర్శులుగా ఉన్నాము. ఆ తర్వాత 10 మహాసభలు నిర్వహించాక పెద్దలందరూ వరుసగా



ఎం.వెంకయ్యానాయుడు గారిచే సత్కారం పొందుతూ... చిత్రంలో తుర్లపాటి కుటుంబరావు, సినీగేయ కవి రసరాజు, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు తదితరులున్నారు.

కాలం చేయటంతో కొంత విరామం ఏర్పడి 2004లో పునరుద్ధరించి ఈ స్థాయికి తెచ్చాము. నేను కార్యదర్శిగా పనిచేయటానికే ఎక్కువ ఇష్టపడతాను. 50 యేళ్ళ నా సాహితీ జీవితంలో 45 యేళ్ళపాటు వివిధ సంస్థలకు కార్యదర్శిగానే పనిచేశాను. ప్రస్తుతం నా అంతగా పనిచేయగల కార్యదర్శిని వెదికే పనిలో ఉన్నాను. అన్ని బాధ్యతల్లోంచీ బైటపడి, నా పూర్తి సమయాన్ని రచనా వ్యాసంగానికే కేటాయించా లనుకుంటున్నాను.

మీరు 143 పుస్తకాలు రాశారు. అన్నిటికంటే ఆయుర్వేద వైద్య రచయితగా, రచయితల సంఘం నిర్వాహణ బాధ్యతలోనే మీకు ఎక్కువ గుర్తింపు వచ్చిందని నేను అనుకుంటాను. దానికి మీరు ఏమంటారు?

వైజ్ఞానిక సాహిత్యం నాకు ఎక్కువ పాఠకుల్ని తెచ్చిపెట్టింది. పాఠకులతో తాదాత్మ్యత పొందేందుకు నాకు ఈ సాహిత్యం తోడ్పడింది. లక్షల సంఖ్యలో సందర్శకులున్న నా వీడియో ఇంటర్వ్యూలు నన్ను మధ్యతరగతి ప్రజలకు మరింత చేరువ చేశాయి. ఇప్పుడు మార్కెట్టునేది హెల్త్, ఫుడ్, వాస్తు, జ్యోతిషం గ్రంథాలకే ఉంది. నా వైద్యగ్రంథాల్లో 15-20 ఎడిషన్లు అచ్చయినవి కూడా ఉన్నాయి. నేను నేర్చిన రచనా నైపుణ్యం ద్వారా చదువుకున్న విద్యకు నేను చేసిన న్యాయం ఇది.

భాషోద్యమంలో మీది గణనీయమైన పాత్ర. తెలుగు భాషకు ప్రాచీనతా హోదా రావటంలో మీ 'తెలుగే ప్రాచీనం' ఉపకరించింది కూడా! ఈ ఉద్యమం భవిష్యత్తు ఎలా ఉంటుందంటారు?

ప్రజల్లో భాషాభిమానాన్ని ప్రేరేపించటానికి భాషోద్యమం ప్రథమ ప్రాధాన్యత ఇస్తేనే దానికి భవిష్యత్తు ఉంటుంది. ప్రభుత్వాలతో మధ్యవర్తిత్వాలు, విజ్ఞాపనలు పైస్థాయిల్లో జరుగుతాయి. కానీ, భాషోద్యమ లక్ష్యం ప్రజాదరణను పెంపుచేయటంగా ఉండాలి. "దేశమును ప్రేమించుమన్నా" అని

రాసినప్పుడు దేశీయులకు దేశభక్తిని పెంచుకోమని చెప్పాల్సి రావటం సిగ్గు చేటని గురజాడవారు భావించినట్టు కనిపించదు. అలాగే, తెలుగువారికి తెలుగుని ప్రేమించమని చెప్పటం ఇప్పటి అవసరం. నేను వంటకాల గురించి చెప్పినా అందులో తెలుగుదనం గురించి రాస్తాను. కడుపులో నొప్పి గురించి రాసినా తెలుగు భాష గురించి ప్రస్తావించేందుకు ప్రయత్నిస్తాను. తెలుగు వారికి తెలుగు వంటలు తెలుగు వడ్డనలే ఆరోగ్యదాయకం అని గట్టిగా చెప్తాను. ఆవు వ్యాసం లాగా దేని గురించి మొదలు పెట్టినా చివరికి తెలుగు మీదకే వస్తానని నాకు పెద్ద పేరు. అది నాకు గర్వకారణమే! జనసామాన్యంలో భాష పట్ల అనురాగం పెంచటానికే నా రచనలన్నీ!

మీకు ప్రభుత్వం నుండి చాలా పురస్కారాలు వచ్చాయి కదా.. కానీ ప్రభుత్వం నామినేట్ పదవుల్లో ఒక పేరున్న రచయితగా మీకు సరైన పదవి, గుర్తింపు లభించలేదని నేను అంటాను. మీ సమాధానం?

ప్రభుత్వ పదవి గుర్తింపు తెచ్చేది కాదనే నా నమ్మకం ఇందుకు కారణం కావచ్చు. "ఒక్కసారి మంత్రి చేసి చూడు గణనాథా! నువ్వు ఓడకుంటే ఒట్టు పెట్టు గణనాథా" అని పాట విన్నదే కదా! పదవి వస్తే, నేను తెచ్చుకున్న ఈ మంచి పేరంతా త్యాగం చేయ్యాల్సి వచ్చేది. నిబద్ధత కలిగిన భాషా సేవకుడు భాషకు సంబంధించిన బాధ్యత నిర్వహిస్తే మేలు జరుగుతుంది. షోకిల్లా రాయుళ్ల అలంకార పదవులు భాషకు చేటు చేస్తాయి.

పోలవరం ప్రాజెక్టు ప్రారంభ దశలో, కవులు రచయితలను కలగలుపుకొని మీరు ప్రభుత్వం తరపున ఆ ప్రాజెక్టు నిర్మాణం అవగాహన దశలో భాగస్వాములు అయ్యారు. అలాగే రచయితలకి ప్రభుత్వానికి మధ్య రచయితల సంఘాలు కూడా మధ్యవర్తిత్వం వహించాలని అంటాను. ఆ దిశలో ఒక రచయితల సంఘం బాధ్యులుగా ఎటువంటి పోరాటం చేశారు?



సద్గురు శివానందమూర్తి వారి పురస్కారం అందుకుంటూ...

సాంస్కృతిక శాఖ సంచాలకులుగా రాళ్లబండి కవితా ప్రసాద్, దీర్ఘాసి విజయభాస్కర్ లాంటి సాహితీ మూర్తులు పనిచేసినందు వలన ఎక్కువమంది రచయితలకు ప్రభుత్వ గుర్తింపులు, సత్కారాలు, పురస్కారాలు లభించాయి. ఆ మేరకు ఆ ఇద్దరికీ సహాయ సహకారాలను కృష్ణాజిల్లా రచయితల సంఘం అందించింది కూడా! అంతకుపూర్వం ప్రభుత్వ సాహిత్య కార్యక్రమాలన్నీ హైదరాబాద్ పరిసరాలకు పరిమితంగా నడిచేవి. సాంస్కృతిక శాఖ విజయవాడకు తరలి వచ్చినప్పుడు కృష్ణాజిల్లా రచయితల సంఘం పక్షాన దీర్ఘాసి విజయభాస్కర్ గారికి విజ్ఞప్తి చేస్తూ, ప్రభుత్వ కార్యక్రమం చిన్నదైనా పెద్దదైనా ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకూ సమాన ప్రాతినిధ్యం ఉండేలా చూడమని విజ్ఞప్తి కోరాము. అందుకు వ్యక్తిగతంగా నా వంతు సహకారం అందించాను. భవిష్యత్తులో కూడా ఈ సూత్రాన్ని పాటిస్తే మారుమూల ప్రాంతాల్లో ఉండే రచయితలకూ గుర్తింపు దక్కుతుంది.

ఒక రచయితగా మీ భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉంటుందని భావించవచ్చు?

రచన చేయటంలో ఒకప్పటికన్నా పరిణతిని నాలో నేనే గమనించగలుగుతున్నాను. సాధనమున పనులు సమకూరు ధరలోన... కదా! 1978-80లలో సౌజన్య వారపత్రికలో నేను పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు వ్రాశాను. అవి నా తొలి రచనలు. వాటిలో కొన్ని దొరికాయి. ఇప్పటిలానే, భాషా సంస్కృతుల ఉద్ధరణ అనే కోణంలోనే ఉన్నాయవి. కానీ, ఇప్పుడున్న బహుముఖీనత అప్పట్లో లేదు. 2004 భాషోద్యమంలోకి ప్రవేశించాక మన భాషా సంస్కృతులు, ప్రాచీన సాహితీ వైభవాలకు సంబంధించిన రచనలే ప్రధానంగా చేశాను. మన మూలాల్ని తవ్వి తట్టలకెత్తవలసినవి చాలా ఉన్నాయి. అందుకు ఈ జీవితకాలం చాలదేమో!

జీ.వీ పూర్ణచంద్ అంటే.. ప్రజలు, ప్రభుత్వం మిమ్మల్ని ఎలా గుర్తించాలని మీరు భావిస్తున్నారు?

నాకు ప్రజల గుర్తుంపే ముఖ్యం. ప్రజల గుర్తింపు ఉంటే ప్రజలే మనల్ని తలచుకుంటారు. ప్రభుత్వ గుర్తింపు ఉంటే మనమే పదిమందికీ చెప్పుకుని తిరగాలి. ఎవ్వరూ మనల్ని గుర్తించరు. సాధారణ పాఠకుడికి అందేలా గాఢమైన విషయాల్ని కూడా వలిచి చేతిలో పెడితే అదే ఎక్కువ గుర్తింపు తెస్తుంది. ఆదివారం సంచిక ఆంధ్రజ్యోతిలో నా "తినరా మైమరచి" శీర్షికకు అద్భుతంగా స్పందిస్తోంది మధ్యతరగతి ప్రజలు! ఆహారం వంకబెట్టుకుని వారిలో భాషాభిమానాన్ని కూడా కలిగించే ప్రయత్నం చేస్తున్నాను. నా ప్రతీ రచనకూ వందల కొద్దీ పాఠకులు ఫోనుల్లో స్పందిస్తుంటారు. కానీ, ఒక్క విశ్వవిద్యాలయ ఆచార్యుడుగానీ, తెలుగు పండితుడుగానీ ఫోన్ చేస్తే ఒట్టు. నిజానికి నేను వ్రాస్తున్నది వాళ్లు వ్రాయాల్సిన అంశాలు. ఇన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సబ్జెక్టు ఇది. చదవని మేథావికన్నా మనం రాసేవి చక్కగా చదివే సామాన్యుడే దేశానికి ఎక్కువ మేలు చేస్తాడు. ప్రజల కోసమే నేను వ్రాస్తున్నాను. నా పాఠకులతో ముఖాముఖీ మాట్లాడ కలిగిన ప్రజారచయితని. నాది ప్రజాసాహిత్యం. ఆ గుర్తింపు నిలుపుకోవాల్సిన బాధ్యత నాకుంది.

సంతోషమండీ. మీ సాహితీ స్వర్ణోత్సవాల సందర్భంగా 'రమ్యభారతి' మీకు శుభాకాంక్షలు అందజేస్తున్నది. ధన్యవాదాలండీ.. **- సంభాషణం: చలపాక ప్రకాష్**